
# రక్తాక్షి

డా॥ తెన్నేటి సుబ్బారావు



రాత్రికి తెర పడింది. బద్ధకంగా ఆవులిస్తూ మేల్కొంటోంది ఉదయం. ఉదయంతో బాటు ఊరు–ఊరిలోని కాకులూ, తండ్రి వేసిన కేకతో ఉదయ్ కూడా హడావుడిగా లేవడానికి ప్రయత్నం చేస్తున్నాడు. అవును మరి లేవకపోతే ఎలా...చచ్చీ చెడీ...ఉద్యోగంలో చేరింకా వారమే అయ్యింది. అదీ ఓ ప్రైవేటు కంపెనీలో. అప్పుడే లేటు మార్కు గీతలు...బాసు మార్కు మోతలూ...క్వశ్చన్ మార్కు చూపులూ...మొదలైనవి.

మొదలైతే ఎలా అదీగాక రాక రాక తనకీ ఉద్యోగమొచ్చింది. పాతికేళ్లే భూమ్మీద పడినా, ఇరవయ్యేళ్లె పుస్తకాల మీద పడినా..నాలుగేళ్లె రోడ్డు మీద పడినా ఇన్నాళ్లకి తనకి పురుషుడిగా మారే అవకాశమొచ్చింది. అదీ ఎలాగో అతికష్టం మీద పెద్ద ప్రయత్నం చేస్తే చిన్న ఉద్యోగం. అందుకనే చెయ్యవలసిన పనులన్నీ చేశాడనిపించి త్వరగా తెమిలి బయల్దేరాడా కొత్త పిచ్చోడు. ఆఫ్‌కోర్స్ పెళ్లాం దగ్గరికి కాదు కాని, మొగుళ్లాంటి బాస్ దగ్గరికి.

అలవాటు ప్రకారం అప్పుడప్పుడు కళ్లూ ముక్కూ మూసుకుంటూ బస్టాపు చేరుకున్నాడు. చుట్టూ కలయజూస్తే కనుచూపు మేరలో బస్సొచ్చే సూచనేవీ లేవు. రోజూ ఎదురుగా వచ్చి 'బాబూ ధర్మం' అనే కుర్రాడింకా రాలేదేవిటా అని ఆశ్చర్య పోతూ నిల్చున్నాడు. బస్సింకా రాలేదు జనం మాత్రం మెల్లగా చేరుకుంటున్నారు. చూసిన పాత వాచీవే మళ్లా చూస్తూ మధ్యలో అటూ ఇటూ చూస్తుంటే దూరంగా ఓ మూల చెట్టుకింద చింకి గుడ్డ ముందు పరుచుకొని కూర్చున్న కుర్రాడు, అదే రోజూ అడుక్కునేవాడు దృష్టిలో పడ్డాడు.

ఎంత సేపిలా నించోడం అనుకొంటుండగానే అనుకోకుండా కాళ్లటువైపు లాక్కెళ్లాయి. అరె ఏమిటి చెప్మా అలా వున్నాడు. రోజూ ఎంచక్కా బాగానే తిరిగే వాడు. ఈ రోజెలా కూర్చొని అడుక్కుంటున్నాడు– ఏవిటో చూద్దామని దగ్గరి కెళ్లేడు ఉదయ్. వాడి ముందేసుకున్న చిరిగిన గుడ్డమీద అక్కడక్కడా చిందర వందరగా పడుంది చిల్లర. వాడి వొంటి మీది మరకల్లా "అయ్యా గుడ్డోణ్ణి దరమం సెయ్యండయ్యా" అని జాలిగా దీనంగా అంటుంటే వాడెందుకు రోజూలాగా కనబడలేదో అర్థమైనా ఇంకా వుండబట్ట లేక వాడి నడుగుతున్నాడు. "ఏరా ఆ కళ్లేంటలా ఉన్నాయ్. నిన్నటి వరకూ బాగానే వుండేవి కదా, మందేదైనా వాడక పోయావా" "మందోడకేం బాబూ! మా మావయ్య పోసిందుగా రెండు కళ్లలో. అది మామూలు ఆలాటిలాటి మందు కాదంట, దాంతో ఒక్క కళ్లేంటి మొత్తం బతుకే బాగు పడిపోతాదంట.

ఇంకంతా యెల్తురేనంట. మా అయ్యక్కూడా అల్లయ్య ఇట్టాగే సేసిండంట. నాకు మాత్రం ఎలుగేటి తెలవట్లేదు. అస్సలేదీ ఆనట్లేదు. అంతా సీకటే కనిపిస్తున్నాది. అప్పుడప్పుడూ కంట్లో నుసి వుడతన్నది. నలిపితే మంటెడుతోంది అందుకే మావయ్య నన్నీడ కూకో బెట్టెల్లిండు. కాసింత దరమం సెయ్యండి బాబూ దరమ పబువులు మీకు బోల్డు పున్నెముంటాది."

అప్పటికే ఈనడానికి రెడీగా వున్న గేదె లాంటి బస్సు రావడం, ఉదయ్ దాంట్లోకి చొరబడ్డం, వెళ్లబోయే ముందో రూపాయి బిళ్ల వాడి దగ్గరికి విసిరేయడం, అది దొర్లుకుంటూ వెళ్లి మురికి గుంటలో పడిపోవడం అన్నీ జరిగిపోయాయి.

మనసంతా అదోలా చిరాగ్గా వుంది. పాపం ఆ కుర్రాడి సంగతే గుర్తొస్తోంది. చక్రాల్లాగా ఎంచక్కా మెరిసే కళ్లు రక్తం చిందినట్టెర్రగా వెక్కిరిస్తున్నాయి. మంచు బిందువుల్లాంటి స్వచ్ఛమైన కళ్లు, నందె చీకట్లో అరుణ కాంతిలా మసగ్గా మెరుస్తున్నాయి. స్వార్థమనే కుళ్లు నిండిన కర్కశానికి బలై కన్నీటి కానులు వర్షిస్తున్నాయి. అయినా వాడు పైకి చెప్పేడు. తను చెప్పలేదు. అంతే తేడా. తనకీ ఓ రిటైరైన తండ్రి పెళ్లి కావలసిన చెల్లి వున్నారు. తండ్రి కొచ్చిన డబ్బునీ, తల్లినీ కూడా పొట్టన పెట్టుకుంది మాయదారి కేన్సరు జబ్బు. పోనీ మంచి పెర్మనెంటుద్యోగమా అంటే అది భారత దేశానికి ఒలింపిక్స్‌లో బంగారు పతకం లాంటిది. మరి చెల్లికి గొప్ప సంబంధం



చూసి పెళ్లి చెయ్యడమన్నది. ఇండియాకి మళ్లీ క్రికెట్లో వరల్డు కప్పొచ్చినట్టే.

స్సార్! అనుకుంటూ పరుగెత్తుకుంటూ వస్తూ పెద్ద సారు మిమ్మల్నర్జంటుగా రమ్మన్నారని పిలుస్తున్నాడు ఆఫీస్ బోయ్. బాస్ అప్పడే వచ్చి చిందులేస్తున్నట్టు వ్నాడనుకొని, బిక్క మొగంతో లోని కెళ్లాడు ఉదయ్. "సీ మిస్టర్ ఉదయ్! నీకు తెల్సు కదా మా అబ్బాయి హీరోగా సినిమా తీస్తున్నట్టు. రేపిక్కడ ఔట్‌డోర్ షూటింగంట, చాలా రిస్కుతో కూడుకున్న వ్యవహారం. మల్టీ స్టోరీడ్ బిల్డింగు మీంచి పక్కనున్న గుడిసెమీదికి దూకడం. ప్రేమలో విఫలమైన హీరో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ నిజంగానే కాలుజారి కింద పడిపోవడం. మావాడి కేదైనా దెబ్బ తగిల్తే నే చూడలేను. అసలే పెళ్లి కావలసిన వాడు. ఆపైన కట్నం తగ్గితే వాళ్లమ్మ ఊరుకోదు. అలాగని షూటింగాపితే మావాడు తట్టుకోలేడు. కాబట్టి ఆ సీన్లో హీరోకి బదులుగా చావడానికి అదే ఏక్ట్ చెయ్యడానికో మంచి డూప్ నెవర్నయినా ఎరేంజ్ చెయ్. పబ్లిక్ రిలేషన్సెక్కువ కదా నువ్వే ఎవరో ఒకర్ని చూడు. పడిపోవడం నేచురల్‌గా ఉండాలి. షాట్ కరెక్టుగా రావాలి. రెమ్యునరేషన్ కూడా ఎక్కువగానే ఇద్దాం ఎంతైనా పరవాలేదు" అంటూ బాస్ చెప్పుకొని పోతుంటే, ఉదయ్ బుర్ర కంప్యూటర్లా పన్జేసి తళుక్కున మెరిసిందో చక్కటాలోచన. వెంటనే దాన్నమలు చేయడానికి గట్టిగా నిర్ణయించేసుకొని–

"యెస్సార్! ఆ పని నేనే చేస్తాను సార్. నేనే ఆ డూప్ వేషం వేస్తాను. మంచి రక్తి కట్టిస్తాను. మీరేం వర్రీ అవ్వకండి సార్" అంటూ తేల్చి చెప్పేడు బాస్‌తో. నువ్వా! అంటూ ఆశ్చర్య పోతున్న బాస్‌ని మరో మాటకి ఛాన్సివ్వకుండా "నన్నేమీ తక్కువగా అంచనా వేయకండి సార్. చదువుకొనే రోజుల్లో నేనే అన్నిట్లో ఫస్ట్. ఆటల్లో, నాటకాల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో ది బెస్ట్. నాకో అవకాశం ఇచ్చి చూడండి మీకే తెలుస్తుంది" అంటూ ఉద్వేగంగా చెప్పుకొని పోతున్నాడు ఉదయ్.

"అది కాదయ్యా! మరేదైనా జరగకూడంది జరిగిందనుకో" నానుస్తూ వారిస్తుంటే మధ్యలోనే అందుకొని "నేనేమీ ఊరకనే చేస్తాననడం లేదు సార్! మీరిచ్చిన డబ్బులతో నా చెల్లికి పెళ్లి ఘనంగా చెయ్యొచ్చు. ఖర్మ చాలక నా చెయ్యో కాలో విరిగితే వికలాంగుల కోటాలో గవర్నమెంటు జాబ్ కొట్టేయొచ్చు. మీరు మరేవీ ఆలోచించకండి. సరే అనండి, నేను రెడీ" అంటూ ఒప్పించేడు ఉదయ్.

మర్నాడే షూటింగయ్యింది. విధి వక్రించి వికటాట్ట హాసం చేసింది. ప్రకృతి వికృతంగా కన్నెర్ర చేసింది. ఉదయ్ బుర్రకి బాగా దెబ్బ తగిలి వెంటనే ప్రాణం వదిలేడు.

ఆ మరునాడు దినపత్రికలో వార్త ఎలక్కాయంత అక్షరాలతో, "అప్పుల బాధ భరించలేక, చెల్లెలి పెళ్లి చెయ్యలేక, ముసలి తండ్రి నాదుకోలేక ఓ నిరుద్యోగి ఆత్మహత్య" అని.

ఆ తర్వాత ఉదయ్ చెల్లికి ఎక్స్‌ట్రా ఆర్టిస్టుగా వేషం దొరికింది.

ఆ కుర్రాడికి అడుక్కునే పాత్ర మిగిలింది.

కాలం కుంటుతూనే కదులుతోంది. ఎర్రబడ్డ కళ్లతో ఈ లోకాన్ని సరిగ్గా చూడలేక.